క్లుప్తంగా

నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న ట్రస్టు సభ్యులు

దహెగాం: మండలంలోని మారుమూల గిరిజన గ్రామం లోహాలో మండల కేంద్రానికి చెందిన పుప్పాల ట్రస్టు వ్యవస్థాపకుడు పుప్పాల శ్రీనివాస్ బుధవారం దుప్పట్లు పంపిణీ చేశారు. కుంచవెల్లి తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ కుమార రాజా, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కోవ లక్ష్మికి సన్మానం

ఆసిఫాబాద్‌అర్బన్: ఆసిఫాబాద్ ఎమ్మెల్యేగా గెలుపొందిన కోవ లక్ష్మిని, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కులను బుధవారం జిల్లా కేంద్రం లోని ఎమ్మెల్యే నివాసంలో ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియా జర్నలిస్టులు ఘనంగా సన్మానించారు. సురేశ్, షేక్ ఖలీల్, శ్రీనివాస్‌రావు, సోలంకి, సతీష్, శ్రీధర్, నితీష్, రాధాకృష్ణ చారి, సంతోష్, ప్రకాశ్‌గౌడ్‌లు పాల్గొన్నారు.

వసతి గృహానికి ప్లేట్లు పంపిణీ

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని జన్కాపూర్ జీవన్‌దీప్ వసతి గృహానికి పట్టణానికి చెందిన ప్రఫుల్‌చంద్ 80వ జన్మదినాన్ని పురస్కరించుకొని కుమారుడు మనీష్‌కుమార్ బుధవారం 40 మంది విద్యార్థులకు ప్లేట్‌లు, గ్లాసులు, పండ్లు పంపిణీ చేశారు.

బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయుడికి సన్మానం

వాంకిడి: మండలంలోని ఇందాని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహించి బదిలీపై వెళ్తున్న చెన్నూరి ప్రకాశ్‌ను మండల ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఆయన పాఠశాలకు అందించిన సేవలను ఈ సందర్భంగా ఉపాధ్యాయులు కొనియాడారు. అనంతరం ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యాయులు కలేరాం, అమరేశ్వరి, శ్రావణి, భాగ్యలక్ష్మి, శ్వేత, సరస్వతి, సుభాష్, సీఆర్పీ సందీప్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు అభినందనలు



అభినందనలు తెలుపుతున్న ఎస్సైలు

కాగజ్‌నగర్‌టౌన్: సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీశ్‌బాబుకు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. పట్టణంలోని సర్‌సిల్క్‌లో గల ఎమ్మెల్యే నివాసంలో బుధవారం టౌన్ ఎస్సైలు శ్రీకాంత్, కల్యాణ్, రూరల్ ఎస్సై సోనియా ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. టీఎస్ యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం పదాధికారులు, విద్యుత్ శాఖ, అటవీ శాఖ, పబ్లిక్ హెల్త్ శాఖ, ఎస్‌ఈఆర్‌పీ (ఐకేపి) సిబ్బంది, వ్యవసాయ శాఖాధికారులు వేర్వేరుగా ఎమ్మెల్యేను ఆయన నివాసంలో కలిసి అభినందనలు తెలిపారు.

'ఆనంద్ మేళా' పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కోవ లక్ష్మి, ఆత్రం సక్కు

ఆసిఫాబాద్: ఏటా జనవరి 1న కాగజ్‌నగర్ పట్టణంలో నిర్వహించే ఆనంద్ మేళా కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను బుధవారం ఎమ్మెల్యే కోవ లక్ష్మి జిల్లా కేంద్రంలోని తన నివాసంలో మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కుతో కలిసి ఆవిష్కరించారు. కోవ లక్ష్మి మాట్లాడుతూ కళలు అంతరించకుండా, కళాకారుల్లోని కళను వెలికితీయాలనే ఉద్దేశంతో ఆనంద్‌మేళా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు శ్రీధర్, ఉద్యమ గాయకులు ఇర్ఫాన్, నిర్వాహకులు డాన్స్ మాస్టర్ సంతోష్ పాల్గొన్నారు.

అయ్యప్ప పడిపూజ

తాండూర్: మండలంలోని సురభి గోధాక్షేత్ర గార్డెన్స్‌లో మంగళవారం రాత్రి అయ్యప్ప స్వామి పడిపూజ కార్యక్రమం కనుల పండువగా నిర్వహించారు. రెబ్బెనకు చెందిన గురుస్వామి కిరణ్‌శర్మ 18వ సారి శబరియాత్రను పురస్కరించుకుని నిర్వహించిన ఈ పడిపూజ కార్యక్రమానికి ఆదిలాబాద్‌కు చెందిన తాంత్రి సాయికృష్ణ దుబే గురుస్వామి హాజరై పూజా కార్యక్రమాలు చేపట్టారు. పడిపూజకు ఆసిఫాబాద్, రెబ్బెన, సిర్పూర్ కాగజ్‌నగర్, బెల్లంపల్లి, మందమర్రి, మంచిర్యాల, తాండూర్ నుంచి దాదాపు 300మంది అయ్యప్ప స్వామి మాలధారులు హాజరయ్యారు. అయ్యప్ప స్వామి శరణు ఘోషతో ప్రాంతమంతా మారుమోగింది.

ఖాళీ జాగా.. వేసెయ్ పాగా!

- ప్రభుత్వ భూముల్లో వెలుస్తున్న టేలాలు
- పట్టించుకోని అధికారులు
- ప్రజాప్రతినిధుల కనుసన్నల్లోనే అక్రమాలు!



గంగాపూర్ కమాన్ వద్ద తాజాగా వెలిసిన టేలా

రెబ్బెన: మండల కేంద్రంలో ఖాళీ జాగా కనిపిస్తే చాలు రాత్రికి రాత్రే అక్రమ టేలాలు వెలుస్తున్నాయి. జాతీయ రహదారి నిర్మాణ పనుల్లో భాగంగా మండల కేంద్రంలో రోడ్డును విస్తరించడంతో చాలా మంది చిరు వ్యాపారులకు వ్యాపారాల నిర్వహణకు స్థలం లేకుండా పోయింది. దీంతో ప్రధాన రహదారితో పాటు గల్లీ రోడ్లలో ఖాళీ స్థలాలను వదలకుండా టేలాలు ఏర్పాటు చేస్తున్నారు. జాతీయ రహదారి ఏర్పాటుకు ముందు వివిధ షాపుల ఎదుట, రోడ్డు పక్కన తాత్కాలికంగా తోపుడు బండ్లు, చిన్న టేలాలు ఏర్పాటు చేసుకున్న వారు ప్రస్తుతం శాశ్వత పరిష్కారం కోసం ఖాళీ స్థలాలు ఎంచుకుంటున్నారు. గుట్టు చప్పుడు కాకుండా ఖాళీ స్థలాల్లో టేలాలు ఏర్పాటు చేసి కొన్ని రోజుల పాటు వేచిచూసి టేలాల్లో తమ పనులు ప్రారంభిస్తున్నారు.

ప్రజాప్రతినిధుల అండ..

మండల కేంద్రంలో ప్రస్తుతం భూముల ధరలు ఆకాశన్నంటుతున్నాయి. ప్రధాన రహదారిపై వ్యాపారాలకు అనువైన ప్రాంతంలో భూముల ధరల చూస్తే సామాన్య, మధ్య తరగతి ప్రజలు కొనలేని పరిస్థితి ఉంది. జాతీయ రహదారి విస్తరణకు ముందు రోడ్డు పక్కన ఉన్న షాపుల యజమానులకు ఎంతో కొంత కిరాయి చెల్లించి షాపుల ముందు ఖాళీ స్థలంలో చిరు వ్యాపారాలు నిర్వహించేవారు. జాతీయ రహదారి విస్తరణతో మండల కేంద్రంలో ప్రధాన రహదారి వెంట గతంలో ఉన్న షాపులే ఇరుకుగా మారటంతో పాటు ఫ్లై ఓవర్ నిర్మాణం, సర్వీస్ రోడ్ల ఏర్పాటుతో చిరు వ్యాపారాలను రోడ్డు పక్కన ఏర్పాటు చేసుకునే వీలు లేకుండా పోయింది. దీంతో ఆర్‌అండ్‌బీ గెస్టుహౌస్ ఖాళీ స్థలంతో పాటు, సబ్ స్టేషన్‌కు వెళ్లే దారి, రైల్వే గేట్ వైపు వెళ్లే దారితో పాటు రైతువేదిక వద్ద ఉన్న ఖాళీ స్థలాల్లో రాత్రి రాత్రికే టేలాలు ఏర్పాటు చేశారు. కాగా ప్రజాప్రతినిధుల కనుసన్నల్లోనే టేలాలు ఏర్పాటు చేస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రజాప్రతినిధులకు ఎంతో కొంత ముట్టచెప్పుతుండటంతో దర్జాగా ప్రభుత్వ ఖాళీ స్థలాల్లో టేలాలు ఏర్పాటు చేసుకుంటున్నారని, అధికారులు సైతం పట్టించుకోవడం లేదని విమర్శలు విన్పిస్తున్నాయి. కాగా అక్రమంగా ఏర్పాటు చేసుకున్న టేలాలకు, షెడ్లకు విద్యుత్ మీటర్ల ఏర్పాటుకు అధికారులు ఎలా అనుమతించారని మండలవాసులు ప్రశ్నిస్తున్నారు.

ప్రభుత్వ భూములు కాపాడాలి



మండల కేంద్రంలో ఎంతో విలువైన ప్రభుత్వ భూములు కబ్జాకు గురికాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. ఖాళీ స్థలాల్లో అక్రమంగా రోజుకో టేలా, షెడ్డు ఏర్పాటు చేస్తుంటే అధికారులు చోద్యం చూస్తున్నారు. మండల కేంద్రంలో ప్రస్తుతం భూముల ధరలు రూ.లక్షల్లో ఉన్నాయి.

- బోగే ఉపేందర్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి

టేలాలు తొలగించాలి



మండల కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ గెస్టుహౌస్, రైతువేదిక, సబ్‌స్టేషన్ రోడ్డులో అక్రమంగా ఏర్పాటు చేసిన టేలాలను అధికారులు వెంటనే తొలగించాలి. ఆర్‌అండ్‌బీ గెస్టుహౌస్, రైతువేదిక వద్ద ఉన్న ఖాళీ స్థలాలు ప్రభుత్వ అధికారులు వినియోగించకుంటే అర్హులైన వారికి లాటరీ పద్ధతిలో కేటాయించాలి.

- దుర్గం రవీందర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు

చర్యలు తీసుకుంటాం

రెవెన్యూ భూమిలో అక్రమంగా టేలాలు, షెడ్లు ఏర్పాటు చేస్తే తొలగిస్తాం. మండల కేంద్రంలో అక్రమ టేలాలపై దృష్టి పెడతాం. రోడ్ల వెంట టేలాలు, షెడ్లు ఏర్పాటు చేస్తే పంచాయతీ కార్యదర్శులు వాటిని తొలగించాలి. మండల కేంద్రంలో అక్రమ నిర్మాణాలను తొలగిస్తాం.

- సమీర్, తహసీల్దార్

దుమ్ముతో ఉక్కిరిబిక్కిరి!

- కౌటాలలో దుమ్ము, ధూళితో ఇబ్బందులు
- పొంచి ఉన్న శ్వాసకోశ వ్యాధులు



కౌటాలలో రోడ్డు పై లేస్తున్న దుమ్ము

కౌటాల: మండల కేంద్రంలో వాహనాల రాకపోకలతో విపరీతంగా దుమ్ము, ధూళి లేస్తుండడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీ పారిశుధ్య కార్మికులు రోజూ రోడ్డుపై చెత్త లేకుండా శుభ్రం చేస్తూ ఉండగా మరోవైపు కొత్త భవనాలు నిర్మించే వారు ప్రధాన రహదారిపైనే ఇసుక, కంకర, మొరం వేస్తున్నారు. దీంతో వాహనాలు వెళ్లినప్పుడు విపరీతంగా దుమ్ము లేస్తుంది.

రోడ్డుపైనే కంకర..

ఎన్నికలకు ముందు మండల కేంద్రం నుంచి గుడ్లబోరి వరకు బీటీ రోడ్డు నిర్మాణ పనులను గుత్తేదారు ప్రారంభించారు. రోడ్డుపై కంకర వేసి తారు వేయకుండా వదిలేశారు. దుమ్ము లేవకుండా గుత్తేదారు రోడ్డుపై నీళ్లు పట్టాల్సి ఉన్నా పట్టించుకోవడం లేదు. దీంతో వాహనాలు వెళ్లిన ప్రతీసారి భారీగా దుమ్ము లేస్తోంది. కంకరపై నుంచి ద్విచక్ర వాహనాలు నడిపేందుకు వాహనదారులు ముప్పుతిప్పలు పడుతున్నారు. తరుచూ వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయని వాహనదారులు వాపోతున్నారు.

భవనాల ఎదుట మొరం, మట్టి..

కౌటాలలోని పలువురు రహదారికి ఇరువైపులా ఉన్న తమ భవనాల ఎదుట మొరం, మట్టి వేసి ఎత్తు పెంచుతున్నారు. దీంతో వర్షాలకు రహదారికి ఇరువైపుల ఉన్న మట్టి రోడ్డు మధ్యకి చేరడంతో వాహనాలు వెళ్లినప్పుడు భారీ ఎత్తున దుమ్ము లేస్తుంది. ఎదురుగా వచ్చే వాహనాలు సైతం గుర్తించలేనంత దట్టంగా దుమ్ము కమ్ముకుంటుంది. స్థానిక ఆర్టీసీ బస్టాండ్, కుమురం భీం చౌరస్తా, మార్కెట్ ఏరియా, తలోడి చౌరస్తాలో లేస్తున్న దుమ్ముతో వాహనదారుల బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయి. రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఇళ్లు, వాహనాలు, చెట్లు దుమ్ముమయంగా మారుతున్నాయి.

ఆరోగ్య సమస్యలు..

కంకర లారీలు నిత్యం వెళ్తుండటంతో లేస్తున్న దుమ్ము, ధూళితో రోడ్డు పక్కన నివసిస్తున్న వారికి అసహనం, చికాకుతో సాటు శ్వాస సంబంధిత వ్యాధులతో అవస్థలు పడుతున్నారు. కంకర లారీలతో దుమ్ము ఎక్కువగా లేవడంతో స్థానికులకు శ్వాసకోశ, మూత్రపిండాల సంబంధిత వ్యాధులు వచ్చే అవకాశం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి రోడ్డుకు ఇరువైపులా భవనాలు నిర్మించేవారు మట్టి వేయకుండా తగిన చర్యలు తీసుకోవడంతో పాటు దుమ్ము లేవకుండా రోడ్డుపై ట్యాంకర్ల ద్వారా నీటిని పట్టించాలని మండలవాసులు కోరుతున్నారు.

'అధిష్టానం ఆదేశిస్తే పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ'

ఆసిఫాబాద్: ప్రపంచంలో భారత దేశానికి గుర్తింపు రావడానికి ప్రధాని నరేంద్ర మోదీ కారణమని మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్ అన్నారు. జిల్లా కేంద్రంలో బుధవారం విలేకరులతో మాట్లాడుతూ ప్రధాని మోదీ పాలనలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో అధిష్టానం ఆదేశిస్తే ఎంపీగా పోటీ చేస్తానని తెలిపారు.

కాగజ్‌నగర్ తహసీల్దార్ బదిలీ

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ తహసీల్దార్ కె.శ్రీపాల్ రెడ్డి కౌటాల మండలానికి బదిలీ అయ్యారు. కౌటాలలో తహశీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న టి.కిరణ్ కుమార్‌ను కాగజ్‌నగర్ తహసీల్దార్‌గా బదిలీ చేస్తూ కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఉత్తర్వుల కాపీని కాగజ్‌నగర్ ఆర్డీవో, డీటీవో, ఎస్‌టీవోలకు పంపించారు.

'సకాలంలో రోగులను ఆసుపత్రులకు తరలించాలి'



అంబులెన్సులో పరికరాలు పరిశీలిస్తున్న సతీశ్

రెబ్బెన: కేసులపై 108 సిబ్బంది అప్రమత్తంగా ఉండి సకాలంలో రోగులకు వైద్య సేవలు అందేలా చూడాలని 108, 102 అంబులెన్సుల జిల్లా అధికారి సతీశ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో 108, 102 అంబులెన్స్‌లను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కేసుల విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరించిన, సకాలంలో 108లు సంఘటన స్థలానికి చేరుకోకుండా జాప్యం చేసినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈఎంటీలు శ్రీకాంత్, పరుశురాం, ప్రశాంత్, నరేష్, పైలెట్లు సంతోష్, తిరుపతి, వాసుదేవ్, సంపత్, నానయ్యలు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలి

లింగాపూర్: తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన మహాలక్ష్మి పథకంతో ఉపాధి కోల్పోతున్నామని ఆటోవాలాలు రోడ్డుపై ఆందోళన చేశారు. మండల కేంద్రంలో ఆటో యూనియన్ల ఆధ్వర్యంలో డ్రైవర్లు, ఓనర్లు ప్రధాన రహదారిపై ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రాష్ట్రప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆటో కార్మికులను ప్రభుత్వమే ఆదుకోవాలని కోరారు.

ప్రభుత్వ పథకాలపై అవగాహన



మాట్లాడుతున్న ఏవో రామకృష్ణ

కాగజ్‌నగర్‌రూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పథకాలపై బుధవారం మండలంలోని నజ్రూల్‌నగర్ గ్రామంలో రైతులకు వ్యవసాయశాఖ అధికారులు అవగాహన కల్పించారు. ఏవో రామకృష్ణ మాట్లాడుతూ కొత్తగా పట్టా పాసుబుక్ వచ్చిన రైతులు యాసంగి సీజన్ కోసం రైతుబంధు పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆధార్ కార్డు, పట్టా పాసుబుక్, బ్యాంకు ఖాతా పుస్తకంతో ఏఈవో వద్ద ఆన్‌లైన్ చేయించుకోవాలని సూచించారు. పీఎంకిసాన్ డబ్బులు పొందాలంటే ఈ కేవైసీ చేసుకోవాలన్నారు. మండలంలో 511 మంది రైతులు ఈ కేవైసీ చేసుకోలేదని తెలిపారు. కార్యక్రమంలో ఏఈవో శైలేష్, రైతులు పాల్గొన్నారు.

సమన్వయంతోనే అభివృద్ధి సాధ్యం

- ఎంపీపీ రోజారమణి



మాట్లాడుతున్న ఎంపీపీ రోజారమణి

బెజ్జూర్: ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతోనే మండల అభివృద్ధి సాధ్యమవుతుందని ఎంపీపీ రోజారమణి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన బుధవారం సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు తమ నివేదికలు చదివి విన్పించారు. తహసీల్దార్ భూమేశ్వర్ మాట్లాడుతూ కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. కాగజ్‌నగర్ నీటి పారుదల శాఖ డీఈఈ అజయ్ మాట్లాడుతూ మండలంలో ఐదు చెక్‌డ్యాంలు మంజూరైనట్లు తెలిపారు. ఉట్‌సారంగపల్లికి రూ.2.85 కోట్లు, కుకుడకు రూ.3 కోట్ల 10 లక్షలు, బెజ్జూర్‌కు రూ.2 కోట్ల 49 లక్షలు, కృష్ణపల్లికి రూ.3కోట్ల 8లక్షలు, సుస్మీర్‌కు రూ.4కోట్ల31 లక్షలు మంజూరైనట్లు వివరించారు. బెజ్జూర్‌లో తునికాకు రాయల్టీ సక్రమంగా రావడం లేదని స్థానిక సర్పంచ్ అన్సార్ హుస్సేన్ సభ దృష్టికి తీసుకొచ్చారు. రాయల్టీ అందని వారి వివరాలు బీట్ అధికారులకు తెలియజేస్తే రాయల్టీ అందేలా చూస్తామని బీట్ అధికారి శ్రీధర్ తెలిపారు. అటవీ ప్రాంతంలో పులి సంచారం ఉందని, రైతులు గుంపులుగా వెళ్లాలని సూచించారు. సమావేశంలో పుష్పలత, పీఏసీఎస్ చైర్మన్ ఓంప్రకాశ్, ఎంపీడీవో మాధవి, ఎంపీవో రమేశ్ రెడ్డి, రమేశ్ బాబు, ఏవో రాజుల నాయుడు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ అభిలాష్, పృథ్వీరాజ్ తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ వినియోగదారుల కేవైసీ పాట్లు



బారులు తీరిన మహిళలు

ఆసిఫాబాద్: జిల్లాలోని వంటగ్యాస్ వినియోగదారులు కేవైసీ కోసం పాట్లు పడుతున్నారు. ఇటీవల కాంగ్రెస్ ఎన్నికల హామీలో రూ.500లకు గ్యాస్ సిలిండర్ ఇస్తామని ప్రకటించింది. ఈ క్రమంలో కేవైసీ ఉంటేనే తమకు సబ్సిడీ వర్తిస్తుందని మహిళలు జిల్లా కేంద్రంలోని గ్యాస్ ఏజెన్సీ ముందు బారులు తీరుతున్నారు. గ్యాస్ సబ్సిడీకి కేవైసీకి సంబంధం లేదని ఏజెన్సీ నిర్వాహకులు తెలిపినా పట్టించుకోవడం లేదు.

రైతులకు నష్టం కలిగితే ఊరుకోం



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు

- ఎమ్మెల్యే హరీశ్‌బాబు
- దహెగాంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

సాక్షి ఎఫెక్ట్

దహెగాం: ధాన్యం కొనుగోలు విషయంలో మిల్లర్లు, అధికారులు రైతులకు నష్టం కలిగిస్తే ఊరుకోమని సిర్పూర్(టి) ఎమ్మెల్యే హరీశ్ బాబు అన్నారు. వరి కోతలు ప్రారంభమై నెల రోజులు పూర్తయినా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయలేదు. దీంతో ధాన్యాన్ని ప్రైవేటు వ్యాపారులకు విక్రయిస్తున్న నేపథ్యంలో 'సాక్షి'లో ఈ నెల 7న 'ధాన్యం కొనేది లేనట్టేనా' శీర్షికన కథనం ప్రచురితం కావడంతో ఉన్నతాధికారులు స్పందించారు. బుధవారం మండల కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే హరీశ్‌బాబు ప్రారంభించారు. అనంతరం రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. యాసంగిలో ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు విక్రయిస్తే మిల్లర్లు క్వింటాలుకు 5 నుంచి 10 కిలోల కోత విధించడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. ప్రస్తుతం ఖరీఫ్‌లో కోతలు విధించకూడదన్నారు. మిల్లర్లు కోతలు విధిస్తే పెద్దపల్లి, కరీంనగర్ జిల్లాలకు ధాన్యాన్ని తరలించి రైతులకు గిట్టుబాటు ధర లభించే విధంగా చూస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వేణు, డీసీవో తారామణి, సహకార సంఘం చైర్మన్ కోండ్ర తిరుపతి గౌడ్, వైస్ చైర్మన్ రాపర్తి ధనుంజయ్, సర్పంచ్ పుప్పాల లక్ష్మి, ఎంపీటీసీ రాపర్తి జయలక్ష్మి, ఏవో వంశీ క్రిష్ణ, ఆయా శాఖల అధికారులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న కళాకారులు

రెబ్బెన: తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో బుధవారం కైరిగూడ గ్రామాల ప్రజలకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకు ద్వారా ఖాతాదారులకు అందజేస్తున్న సేవలు, అమలు చేస్తున్న పథకాలపై రమేశ్ ఆర్గనైజేషన్ కళాజాత బృందం కళాకారులు మ్యాజిక్ షో, పాటల ద్వారా ఖాతాదారులకు అవగాహన కల్పించారు. అనంతరం బ్రాంచి మేనేజర్ విశ్వప్రసాద్ మాట్లాడుతూ గ్రామీణ బ్యాంకు ద్వారా అందజేస్తున్న సేవలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బ్యాంకు రుణాలు, సామాజిక భద్రత పథకాలు, జీవనజ్యోతి బీమా యోజన, సురక్ష బీమా పథకం అటల్ పెన్షన్ యోజన పథకం వంటి ఇన్సురెన్స్‌లు ఖాతాదారులకు ఉపయోగకరంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ శ్రావణ్, క్యాషియర్ సురేశ్, బ్రాంచి సిబ్బంది ఇమ్రాన్, జనార్దన్, ఐకేపీ సిబ్బంది రవి, కృష్ణ పాల్గొన్నారు.

హమాలీ కార్మికుల సంక్షేమబోర్డు ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న ఉపేందర్

వాంకిడి: హమాలీ కార్మికుల అభివృద్ధికి ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో హమాలీ కార్మికులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కార్మికుల హక్కుల సాధన ఏఐటీయూసీతోనే సాధ్యమవుతుందన్నారు. కార్మికుల హక్కుల కోసం చేసిన పోరాటాన్ని గుర్తించి సీఐటీయూకు చెందిన 30 మంది హమాలీ కార్మికులు ఏఐటీయూసీలో చేరారన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పిడుగు శంకర్, మండల కార్మిక సంఘం నాయకులు సుధాకర్, సునీల్, ధర్మేందర్, నానాజీ, తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగం బలోపేతానికి కృషి చేయాలి



మాట్లాడుతున్న టీఎస్‌యూటీఎఫ్ నాయకులు

వాంకిడి: రాష్ట్రంలో నూతనంగా ఏర్పడ్డ ప్రభుత్వం విద్యారంగ బలోపేతానికి కృషి చేయాలని టీఎస్ యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం నాయకులు కోరారు. బుధవారం మండల కేంద్రంలోని కేజీబీవీ, ఆశ్రమ పాఠశాలల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శాంతి కుమారి, ఇందురావు మాట్లాడుతూ విద్యా రంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలన్నారు. సంఘం మండల ప్రధాన కార్యదర్శి హరీష్, నాయకులు సాయి, దాదాజీ, లక్ష్మణ్, హనుమంత్‌రావు, సంతోష్, పురుషోత్తం, అంబర్ సింగ్, గణపతి, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

వాగే.. డంపింగ్ యార్డు!



రెబ్బెన: గ్రామాల్లో సేకరించిన చెత్తాచెదారాన్ని వేసేందుకు ప్రభుత్వం అన్ని గ్రామ పంచాయతీల్లో డంపింగ్‌యార్డులు ఏర్పాటు చేసింది. రెబ్బెన గ్రామ పంచాయతీ అధికారులు మాత్రం గ్రామంలోని చెత్తాచెదారాన్ని డంపింగ్‌యార్డుకు తరలించకుండా పులికుంటవాగులో వేస్తున్నారు. దీంతో వాగు చెత్తాచెదారం, ప్లాస్టిక్ కవర్లతో నిండి పూర్తిగా కలుషితవుతోందని స్థానికులు వాపోతున్నారు.